క్లుప్తంగా

కుష్ఠు నివారణపై అవగాహన అవసరం



లెప్రసీ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం : లెప్రసీ వంటి దీర్ఘకాలిక వ్యాధులు పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగించుకోవాలని సర్వసిద్ధి పీహెచ్‌సి వైద్యాధికారి శక్తిప్రియ అన్నారు. పీహెచ్‌సీలో మంగళవారం ప్రపంచ లెప్రసీ నివారణ దినోత్సవంపై అవగాహన కల్పించారు. శరీరంపై వచ్చే మచ్చలను విధిగా తనిఖీ చేయించుకుని వ్యాధిగా గుర్తింపబడితే అవసరమైన చికిత్స చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గణేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు చల్లపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

వాకపాడులో ఫ్యామిలీ డాక్టర్ సేవలు



వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు వాసంతి

ఎస్.రాయవరం : గ్రామస్థాయిలో ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలు సద్వినియోగపరచుకోవాలని పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి వాసంతి అన్నారు. వాకపాడు గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యాధికారి గ్రామంలో ఉంటూ సేవలందించారు.

మెలిపాకలో వైద్య శిబిరం



మెలిపాకలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ప్రారంభిస్తున్న సర్పంచ్ విజయభాస్కరరాజు

మునగపాక : ప్రజల ఆరోగ్య భద్రతకు జగనన్న ఆరోగ్య సురక్ష దోహదపడుతుందని మెలిపాక సర్పంచ్ అయినంపూడి విజయ భాస్కరరాజు పేర్కొన్నారు.మండలంలోని మెలిపాకలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష -2 శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా 140 రకాల మందులు అందుబాటులోకి వచ్చాయన్నారు. ప్రతి ఒక్కరూ శిబిరాన్ని వినియోగించుకోవాలన్నారు. చూచుకొండ వైద్యాధికారి ఎస్తేర్‌రాణి, వైద్య సిబ్బంది, వార్డు సభ్యుడు గుల్ల అమర వెంకట సత్యానారాయణ, గుబ్బల ఆనంద్, సచివాలయ కన్వీనర్ రామరాజు పాల్గొన్నారు.

జైభారత్ సమైక్యతా ర్యాలీ



కోటవురట్లలో ర్యాలీ చేస్తున్న జైభారత్ సభ్యులు

కోటవురట్ల: మండల కేంద్రంలో జైభారత్ ఆధ్వర్యంలో జైహో హిందూ, ముస్లిం సమైక్యతా ర్యాలీని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళి అర్పించి ర్యాలీ చేశారు. జైభారత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ మాట్లాడుతూ గాంధీజీ చూపిన శాంతి మార్గం అనుసరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో జైహో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి త్రిమూర్తులు, మాజీ సర్పంచ్ దాసరి వెంకటరావు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.కొండబాబు, ఎం.గణేష్, సాందీప్‌రాజ్ పాల్గొన్నారు.

3న బహిరంగ వేలం

అనకాపల్లి : జీవీఎంసీ జోన్ పరిధిలో ఖాళీగా ఉన్న దుకాణాలకు స్థానిక జోనల్ కార్యాలయంలో ఫిబ్రవరి 3 ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు జెడ్సీ సుర వెంకటరమణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జనరల్ ఏరియా, హోల్‌సేల్ మార్కెట్‌కు రూ.25 లక్షలు, చేపల మార్కెట్‌కు రూ.44 వేలు, వివిధ రకాల చెట్ల ఫలసాయానికి రూ.12 వేలు ధరావత్తు చెల్లించి ఆక్షన్‌లో పాల్గొనవచ్చని ఆయన పేర్కొన్నారు.

ప్రజారోగ్యానికి పెన్నిధిగా ఆరోగ్య సురక్ష

- పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు
- పెదరాంభద్రపురంలో ఆరోగ్య సురక్ష శిబిరం



జగనన్న ఆరోగ్య సురక్ష బ్రోచర్లను అందిస్తున్న సమన్వయకర్త కంబాల జోగులు, చిక్కాల రామారావు



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కంబాల జోగులు



కృష్ణాపురంలో ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ బోదెపు గోవింద్, తదితరులు

పాయకరావుపేట : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేద ప్రజలకు ఆరోగ్య రక్ష అని, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలో గల పెదరాంభద్రపురం గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్త కంబాల జోగులు హాజరై రోగులకు వైద్యులు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఆరోగ్యం కోసం ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది ద్వారా ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రతి వ్యక్తి ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకుని, తద్వారా గ్రామంలో ఏర్పాటు చేసే వైద్య శిబిరం ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. దీర్ఘకాలిక సంబంధించిన వ్యాధులకు మెరుగైన వైద్యం, అవసరమైన రోగులను కార్పొరేట్ ఆస్పత్రులకు పంపించి, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్య సేవలు అందించడం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 3 వేల రోగాలకు వైద్య సేవలు అందించి, మెరుగైన వైద్యం చేయించడం కోసం రూ.25 లక్షలు రూపాయలు వరకు ఖర్చు చేయడం పేదలకు ఎంతో రక్షణ కల్పిస్తుందన్నారు. సంక్షేమ పథకాలు యథా ప్రకారం కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో మరలా అందరం జగన్‌మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిని చేయాలన్నారు. అనంతరం ఆయన వైద్య పరీక్షలు చేయించుకున్నారు. శిబిరానికి హాజరైన రోగులకు వైద్య పరీక్షల కిట్‌లను అందించారు. శ్రీరాంపురం పీహెచ్‌సీ పరిధిలో జరిగిన ఈ వైద్య శిబిరంలో 360 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. ఉమ్మడి జిల్లాల వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, జెడ్పీటీసీ సూరిబాబు, ఎంపీపీ పార్వతీ తాతారావు, పాల్మన్‌పేట సర్పంచ్ కోటేశ్వరరావు, గ్రామ నాయకులు గారా చక్రవర్తి, గంపల సత్యనారాయణ, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ కె.రామకృష్ణ, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు బొద్ద శ్రీదేవి పాల్గొన్నారు.

సురక్ష శిబిరాలతో విస్తృత ఆరోగ్య సేవలు

యలమంచిలి : జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా గ్రామీణ ప్రజలకు విస్తృత ఆరోగ్య సేవలు అందుతున్నాయని ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. కృష్ణాపురం గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఫేజ్-2 నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రజలకు అందుతున్న సేవలను ఎంపీపీ గోవింద్, ఏటికొప్పాక వైఎస్సార్‌సీపీ నాయకులు జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి భర్త రాముతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ తొలి దశలో నిర్వహించిన సురక్ష శిబిరాన్ని వినియోగించుకోలేక పోయిన వారికి మళ్లీ వైద్య సేవలందించాలనే ఉద్దేశ్యంతో రెండో దశ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ఆరోగ్య శిబిరంలో ఉచిత రక్తపరీక్షలు, బీపీ ఈసీజీ, షుగర్, కంటి పరీక్షలు చేశారు.

సంక్షేమం, అభివృద్ధి జగన్‌తోనే సాధ్యం

- యలమంచిలి ఎమ్మెల్యే రమణమూర్తిరాజు
- పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం



గంగాదేవిపేటలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక: ఒకవైపు సంక్షేమం మరోవైపు అభివృద్ధి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రెండు కళ్లు లాంటివని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు అన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ప్రజలు ఆశీర్వదించాలన్నారు. మండలంలోని గంగాదేవిపేటలో అంగన్‌వాడీ కేంద్రం, మునగపాక బీసీ కాలనీలో రూ.20లక్షలతో నిర్మించిన డ్రైన్లు, మునగపాకలో జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ నిధులతో నిర్మించిన డ్రైన్, గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు, చెర్లోపాలెంలో సచివాలయ భవనం, మడకపాలెంలో జల్‌జీవన్ మిషన్ ద్వారా నిర్మించిన రక్షిత మంచినీటి పథకాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కోట్లాది రూపాయలతో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, సర్పంచ్‌లు దిమ్మల అప్పారావు, భీశెట్టి గంగప్పలనాయుడు,జాజుల వెంకటరమణ, వైస్ ఎంపీపీ బోజా లక్ష్మీ శ్రీనివాసరావు, మూలపేట ఉప సర్పంచ్ దేవీచంద్ర, వైఎస్సార్‌సీపీ నేతలు నరసింహనాయుడు, పిల్లి అప్పారావు, ఎంపీటీసీలు సూరిశెట్టి రాము, బోడకుర్తి గణేష్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కాశీబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

మునగపాక : మహిళా పక్షపాతిగా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సేవలందిస్తున్నారని ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు అన్నారు. ఎన్నికల ముందు మహిళలు తీసుకున్న రుణాలను నాలుగు విడతలుగా మాఫీ చేస్తామని ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నారన్నారు. మునగపాక రాహుల్‌గాంధీ కళ్యాణ మండపంలో మంగళవారం వైఎస్సార్ ఆసరా సంబరాల్లో భాగంగా చెక్కులు అందజేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఆయన క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా నిలబడేందుకు వైఎస్సార్ ఆసరా పథకం ఎంతగానో దోహదపడుతుందన్నారు. గత టీడీపీ హయాంలో మహిళలకు ఒరిగిందేమీ లేదన్నారు. మహిళా సంఘాలను మోసగించిన చంద్రబాబు నాయుడుకు రానున్న ఎన్నికల్లో మళ్లీ గుణపాఠం చెప్పాలన్నారు. 1262 సంఘాలకు గాను12,726 మంది మహిళలకు రూ.10.26 కోట్ల మేర నాలుగో విడతగా రుణమాఫీ జరిగింది.

అభివృద్ధి పనులను సత్వరం పూర్తి చేయండి



మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రమాకుమారి

యలమంచిలి రూరల్ : సాధారణ ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చేలోగానే పురపాలక సంఘం పరిధిలో టెండర్ల దశలో ఉన్న అన్ని అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి అన్నారు.మంగళవారం యలమంచిలి పురపాలక సంఘ కార్యాలయంలో జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో 15వ ఆర్థిక సంఘం నిధులు, సాధారణ నిధులు, ఎంపీ ల్యాడ్స్ నిధులతో చేపడుతున్న చేపట్టబోయే వివిధ పనులకు కౌన్సిల్ ఆమోదముద్ర వేసింది. గొల్లలపాలెం ప్రాంతంలో విద్యుత్ వైర్లు తక్కువ ఎత్తులో ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని సమస్యను పరిష్కరించాలని, కొత్తపాలెంలో కల్వర్టుల నిర్మాణం పూర్తి చేయాలని, లోవోల్టేజి సమస్య పరిష్కరించాలని ఆయా ప్రాంతాల కౌన్సిలర్లు సమావేశంలో ప్రస్తావించారు. రామారాయుడుపాలెం కౌన్సిలర్ మరిణేశ్వర్రావు తన వార్డులో ఇటీవల రహదారి నిర్మాణ పనులు ప్రారంభిస్తే కనీసం తనకు సమాచారం కూడా ఇవ్వలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా అధికారులు చూడాలని చైర్‌పర్సన్ రమాకుమారి సూచించారు. సాధారణ సమావేశం ఎజెండాలో పొందుపరిచిన 10 అంశాలు, అత్యవసర సమావేశంలో పెట్టిన మరో రెండు అంశాలకు సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. పట్టణంలో నివాసముంటున్న 13 మంది మాజీ సైనికోద్యోగులకు ఆస్తి పన్నును మినహాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు అర్రెపు సత్య గుప్తా, బెజవాడ నాగేశ్వర్రావు, దూది నర్సింహమూర్తి, సయ్యద్ బీబీ, పలు వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ కొండలరావు, పట్టణ ప్రణాళికాధికారిణి శ్రీలక్ష్మి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, గోవిందరావు, మేనేజర్ ప్రభాకర్రావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపు

మునగపాక: మునగపాక గౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపు బుధవారం జరుగుతుందని ఉత్సవకమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పెంటకోట ఆదినారాయణ,ఆడారి అప్పలనాయుడులు సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి ఆలయం నుంచి మొదలయ్యే సారె ఊరేగింపు గ్రామంలోని అన్ని వీధుల గుండా సాగుతుందన్నారు. ప్రజలంతా సారె ఊరేగింపును జయప్రదం చేయాలని వారు కోరారు.అలాగే ఫిబ్రవరి 3న గౌరీ పరమేశ్వరుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

పాయకరావుపేట : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో ఎ.సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు మండల పరిషత్ ఆవరణలో గల స్త్రీ శక్తి భవన్‌లో సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశానికి మండలంలో గల 24 గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు విధిగా హాజరు కావాలన్నారు.

జిల్లా స్థాయిలో సత్తా చాటండి

- 'ఆడుదాం ఆంధ్రా' విజేతలకు ఎమ్మెల్యే కన్నబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి అభినందన
- ముగిసిన నియోజకవర్గ స్థాయి పోటీలు



తెరువుపల్లి క్రికెట్ జట్టుకు ట్రోఫీ అందిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి

యలమంచిలి రూరల్: గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో ప్రతిభను గుర్తించి వారు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం-ఆంధ్ర ఆటల పోటీలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోందని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు) అన్నారు. మంగళవారం యలమంచిలి ఎంపీడీవో కార్యాలయంలో ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ ఆటల పోటీల విజేతలకు మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారితో కలిసి ఎమ్మెల్యే ట్రోఫీలు, మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుంచి ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించి వారికి ప్రభుత్వమే తర్ఫీదు నిప్పించి, ఆర్థికంగా చేయూత అందిస్తుందన్నారు. నియోజకవర్గ స్థాయిలో విజేతలంతా మరింత కృషి చేసి జిల్లా స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి మాట్లాడుతూ ఈ పోటీలతో గ్రామీణ క్రీడాకారులకు గుర్తింపు లభించిందన్నారు. క్రీడలతో శారీరక, మానసికోల్లాసం కలుగుతుందని డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గోవింద్, మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు ఎర్రయ్యదొర, మున్సిపల్ వైస్ చైర్మన్లు అర్రెపు సత్య గుప్తా, బెజవాడ నాగేశ్వర్రావు, మున్సిపల్ కమిషనర్ కొండలరావు, ఎంపీడీవో అప్పలనాయుడు, పీఈటీ మూర్తి పాల్గొన్నారు.

జిల్లా స్థాయికి ఎంపికైన జట్లు

క్రికెట్ పురుషుల విభాగంలో యలమంచిలి,కబడ్డీ పురుషుల విభాగంలో అచ్యుతాపురం,మహిళల విభాగంలో అచ్యుతాపురం,ఖోఖో పురుషుల విభాగంలో అచ్యుతాపురం,మహిళల విభాగంలో మునగపాక,వాలీబాల్ పురుషుల విభాగంలో రాంబిల్లి, మహిళల విభాగంలో అచ్యుతాపురం, బ్యాండ్మింటన్ పురుషుల విభాగంలో యలమంచిలి,మహిళల విభాగంలో యలమంచిలి జట్లు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యాయి.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానమిచ్చిన గృహిణి గొల్లవిల్లి జానకికి . ధ్రువీకరణ పత్రం ఇస్తున్న నిర్వాహకులు

యలమంచిలి రూరల్ : ఒకరి రక్తదానం ముగ్గురికి ప్రాణదానం అనే నినాదంతో యలమంచిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ రక్తదాన శిబిరం తుని మదర్ బ్లడ్ సెంటర్ పర్యవేక్షణలో జరిగింది. మొత్తం 30 మంది స్వచ్ఛందంగా శిబిరానికి వచ్చి రక్తదానం ఇచ్చారు. వీరిలో ఇద్దరు మహిళలు కూడా ఉన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల నెలకొల్పి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పూర్వ విద్యార్థులు వందేళ్ల ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి సమాయత్తమౌతున్నారు. రక్తదాతలకు మదర్ బ్లడ్ సెంటర్ సంస్థ ధృవీకరణ పత్రాలను అందజేసింది. రక్తదానం సేవ మాత్రమే కాదని ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తుంచుకోవాలని యలమంచిలి ఎంఈవో మీనాక్షి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భాగ్యవతి, విశ్రాంత అధ్యాపకుడు ఆడారి పూరీ జగన్నాథం, రమణ మాస్టారు అభిప్రాయపడ్డారు. పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు కొఠారు దుర్గారావు, గొల్లవిల్లి జానకి, గొల్లవిల్లి చిన్నాజీ, సీఏ బంగారు శెట్టి, మనం చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మహాత్ముని ఆశయాలు సాకారం చేయాలి

- సీనియర్ సిటిజన్స్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు
- యలమంచిలిలో ఘనంగా మహాత్మునికి నివాళులు



కె.వెంకటాపురంలో మహాత్ముని విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం



యలమంచిలిలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీనియర్ సిటిజన్స్

యలమంచిలి : మహాత్మగాంధీ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ సమసమాజ స్థాపనకు కృషి చేయాలని యలమంచిలి పట్టణానికి చెందిన ఆర్య వైశ్య సంఘం సభ్యులు, సీనియర్ సిటిజన్స్ పేర్కొన్నారు. మహాత్మగాంధీ వర్ధంతి సందర్భంగా యలమంచిలి పట్టణంలో మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న గాంధీ విగ్రహానికి సీనియర్ సిటిజన్స్ పలువురు వక్తలు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. గాంధీ గ్రామ స్వరాజ్య స్థాపన దిశగా అడుగులు పడే విధంగా శాంతియుత మార్గం ద్వారా పయనించారని ఆయన చేసిన సేవలు స్మరించుకున్నారు. యలమంచిలి రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న గాంధీ విగ్రహానికి పట్టణంలో ఉన్న ఆర్యవైశ్యసంఘం సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు.

ఎస్.రాయవరం : జాతిపిత మహాత్మాగాంధీ ఆశయసాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎస్.రాయవరం సర్పంచ్ భూపతి అప్పారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు వియ్యపు వరహాలరావు అన్నారు. గాంధీజీ వర్ధంతి సందర్భంగా గ్రామంలో గల గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అడ్డురోడ్డు, ఎస్.రాయవరం, పి.ధర్మవరం గ్రామాల్లో కూడా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చొప్పా రాజు, లక్కోజి ఆదిమూర్తి, కుర్రా కాశి పాల్గొన్నారు.

కోటవురట్ల: జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం కె.వెంకటాపురంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద మహాత్ముని విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. వైఎస్సార్ సీపీ నాయకులు గొల్లు చిట్టిబాబు, రామసత్యనారాయణ, సత్యంనాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు. మండల కేంద్రంలో జైభారత్ ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి నిర్వహించారు. ఆ సంఘ నాయకులు వెంకటరమణ,త్రిమూర్తులు, మాజీ సర్పంచ్ వెంకటరావు పాల్గొన్నారు.

గాంధీ బోధనలు శిరోధార్యం

అచ్యుతాపురం : గాంధీ మహాత్ముని బోధనలు నవ భారత నిర్మాణానికి బాటలు వేస్తాయని తిమ్మరాజుపేటకు చెందిన శరగడం బాపునాయుడు అన్నారు. తిమ్మరాజుపేట ఎలిమెంటరీ పాఠశాలలో గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మారిసెట్టి వెంకట అప్పారావు, అనంతరావు, యల్లపు గోవింద పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ..

- బొడ్డేడ పుట్టిన రోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు



మునగపాక దళితవాడలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న బొడ్డేడ ప్రసాద్



రక్తదానం చేస్తున్న బొడ్డేడ ప్రసాద్

మునగపాక: వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్దసంఖ్యలో తరలివచ్చి ప్రసాద్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ కార్యాలయం ఆవరణలో రక్తదాన శిబిరాన్ని ప్రసాద్ ప్రారంభించి తాను కూడా రక్తదానం చేశారు. దళితవాడలోనూ,చూచుకొండ, మునగపాక నందీశ్వర ప్రాంగణం, నాగులాపల్లి, తోటాడ తదితర ప్రాంతాల్లో పేదలకు ప్రసాద్ చేతుల మీదుగా దుప్పట్లు పంపిణీ చేశారు. నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, నియోజకవర్గ ఇన్‌చార్జి కంబాల జోగులు,మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణ రాజు, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి మలసాల భరత్‌కుమార్, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, వైఎస్సార్‌సీపీ నేతలు దిలీప్ కుమార్, డాక్టర్ విష్ణుమూర్తి తదితరులు ప్రసాద్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బొడ్డేడ మిత్ర మండలి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి: చినదొడ్డిగల్లు శివారు కొత్తూరులో ఆంజనేయస్వామివారి ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి స్వామి వారికి తమలపాకు పూజలు, ఆంజనేయ హోమాలు నిర్వహించారు. కొత్తూరు, దొడ్డిగల్లు , వేంపాడు గ్రామాల నుంచి భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భజన కార్యక్రమాలు, అన్నసమారాధన ఏర్పాటు చేశారు.





జంతు సంపదను పరిరక్షించాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న పశు వైద్యాధికారి చైతన్యమణి

కశింకోట : జంతు సంపదను ప్రతి ఒక్కరూ పరిరక్షించాలని నరసింగబిల్లి పశు వైద్యాధికారి చైతన్యమణి తెలిపారు. జంతు సంక్షేమ సామాజిక బాధ్యత పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం నరసింగబిల్లి హైస్కూల్లో విద్యార్థులకు జంతువుల పరిరక్షణపై అవగాహన కలిగించారు. జంతు సంపద మానవ మనుగడకు అవసరమన్నారు. వాటిపై కరుణ చూపాలన్నారు. వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోన నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే జంతువుల పరిరక్షణ పట్ల బాధ్యత వహించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉత్సాహంగా కళాశాల వార్షికోత్సవం



ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్యం

కోటవురట్ల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. వేడుకలో ప్రిన్సిపాల్ పి.కొండబాబు మాట్లాడుతూ విద్యతోనే ఉన్నత జీవితం సాధ్యపడుతుందన్నారు. జూనియర్ కళాశాల విద్యార్థుల జీవితాలకు మలుపునిస్తుందన్నారు. పట్టుదల, లక్ష్యంతో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.